www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 సెప్టెంబర్ 2024

5

కాకినాడ

ఓజోన్ పొర ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఓజోన్ పొర ఆవశ్యకతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత అన్నారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ఓజోన్ పొర ఆవశ్యకతను వివరించారు. స్థానిక డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ వి.మల్లి కార్జున శర్మ మాట్లాడుతూ క్లోరో ఫ్లోరో కార్బన్ల వినియోగం తగ్గించాలని పిలుపు నిచ్చారు. ఓజోన్ పొర క్షీణిస్తే వచ్చే ప్రతికూల ప్రభావాలను వివరించారు. ఈ కార్య క్రమంలో అధ్యాపకులు డాక్టర్ డి.వెన్నెరావు, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ ప్రగడ ప్రయాగ మూర్తి, కె.వెంకటేశ్వరరావు, వి.రామారావు, కె.సురేష్, కెవిఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

డెంగీ డేంజర్ బెల్స్

- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- ఇప్పటి వరకూ 160 కేసులు నమోదు
- అనధికారికంగా వేలల్లో జ్వర పీడితులు
- ఆందోళనలో జిల్లా ప్రజలు
- ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన ఉమ్మిడి కృప(20) డెంగీ జ్వరంతో ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందడంతో జిల్లాలో అలజడి రేగుతోంది. డెంగీ జ్వర పీడితుల్లో ఆందోళన ఎక్కువైంది. ఆగస్టు, సెప్టెంబరులతోపాటు అక్టోబరు నెల్లో డెంగీ ప్రమాదం పొంచి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ జ్వరాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో ఏ జ్వరమొచ్చినా ప్రజలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణ జ్వరమైనా ఆసుపత్రులు, రక్త పరీక్షా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు.

జిల్లాలో 160 కేసులు

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అధికారికంగా 4,600 మందికి ఎలిసా టెస్టులు చేయగా 160 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఆగష్టు నెలలోనే 1800 పరీక్షలు చేయగా అత్యధికంగా 45 కేసులు వెలుగుచూశాయి. ఈనెల 1 నుంచి 17 వరకూ 1500 మందిని పరీక్షించగా మరో 28 మందికి డెంగీ చోకింది. అలాగే ఇప్పటి వరకు 1.39 లక్షలు టెస్టులు చేయగా 5 మలేరియా కేసులు వెలుగు చూశాయి. సెప్టెంబరులో 11 వేల పరీక్షలు చేశారు. ప్రధానంగా డెంగీ కేసులు ఎన్నడూ లేనివిధంగా అధికంగా నమోదవుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కేసులు పెరుగుదలతో అటు జిల్లా ప్రజానీకంతోపాటు వైద్యాధికార వర్గాలు కలవరం చెందుతున్నాయి. ఇంకోవైపు ప్రయివేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్న వారు వేలల్లోనే ఉంటారని సమాచారం. ప్రభుత్వాసుపత్రుల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది, సౌకర్యాలు కానరాక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. డెంగీతోపాటు మలేరియా, ఇతర వైరల్ ఫీవర్స్ వెంటాడుతున్న తరుణంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

అరకొర చర్యలేనా..?

ప్రస్తుతం వర్షాకాలం సీజన్ నడుస్తోంది. ఎక్కడ చూసినా చెత్త, మురికి గుంటలు దర్శన మిస్తున్నాయి. దీంతో దోమలు దండయాత్రకు మరింత అవకాశం ఏర్పడుతుంది. వాటి వృద్ధి నానాటికీ పెరుగుతూ వస్తోంది. అధికారులు గుర్తించిన హై రిస్క్ గ్రామాల్లోనే డెంగీ మరింత వ్యాప్తి చెందుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాంతాల్లో సరైన చర్యలు తీసుకోకుండా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే ఇందుకు కారణంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టులో యు.కొత్తపల్లి, నాగులాపల్లి, పెద్దాపురం మండలం పులిమేరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వీటిని హై రిస్క్ ప్రాంతాలుగా గుర్తించారు. గతంలో పి.మల్లవరం పిహెచ్సి పరిధిలోని జి.కొత్తపల్లి, కాకినాడ అర్బన్లో జగన్నాయక్పురం, దుమ్ములపేట, వేట్లపాలెం పిహెచ్సి పరిధిలో వేమవరం, గొల్లప్రోలులో పాపయ్య చావిడి వీధి, తాళ్లరేవు మండలంలోని పరదేశమ్మ పేట, కాకినాడ రూరల్ మండలం తమ్మవరం, యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్, ఎన్.సురవరం పిహెచ్సి పరిధిలోని కొలిమేరు, తుని పట్టణంలోని ఆర్కె.కాలనీ, జగ్గంపేట మండలం రాజపూడి, శంఖవరం మండలంలోని ఎ.మల్లవరం, శాంతి ఆశ్రమం, కోటనందూరు మండలం సంగవాకలను గుర్తించారు. వీటిల్లో జూన్ మొదటి వారం నుంచి ఇంటింటికి బృందాలను పంపించి గ్రామంలోని ప్రతీ ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఫ్రైడే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తూ, గుర్తించిన ప్రదేశాల్లో గంబుజా ఫిష్ పిల్లలను వదులుతున్నామని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 1.50 లక్షల చేప పిల్లల్ని విడుదల చేసినట్లు అధికారుల గణంకాలు చెబుతున్నాయి. అయితే పారిశుధ్య మెరుగుదలకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంది.



నిర్ధారణ పరీక్షల్లో జాప్యం...

డెంగీ నిర్ధారణ పరీక్షలు, ఫలితాల్లో జాప్యం జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో కాకినాడ జిజిహెచ్, తుని ఏరియా ఆస్పత్రుల్లో మాత్రమే డెంగీ నిర్ధారణకు ఏలీసా పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో సేకరించిన శాంపిల్స్ ఈ ప్రాంతాలకు పంపుతున్నారు. కాకినాడ జిజిహెచ్లో రోజుకి సుమారు 100, తునిలో 25 పరీక్షలు చేస్తున్నారు. దాంతో జాప్యం అనివార్యమవుతుంది.

ప్రయివేటు ఆస్పత్రులు కిటకిట

డెంగీ కేసులు ఎక్కువగానే ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు అధిక సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. అయితే ప్రయివేటు ఆసుపత్రుల్లో చేసే పరీక్షలను తాము లెక్కల్లోకి తీసుకోవడం లేదని జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు వివరిస్తున్నారు. జిల్లాలో పలు ప్రయివేటు ల్యాబుల్లో డెంగీ పరీక్షలు చేస్తున్నారు. కొన్ని చోట్ల రాపిడ్ టెస్టు కిట్లు ఉపయోగిస్తుండగా, మరికొన్ని చోట్ల ఎలీసా రీడరుతో చేస్తున్నారు. ప్రయివేటు ఆస్పత్రులు, ల్యాబుల్లో చేసే పరీక్షలను ప్రభుత్వ యంత్రాంగం పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో వాటిల్లో చేసే పరీక్షల్లో డెంగీ పాజిటివ్ వస్తే మరోసారి జిల్లా కేంద్రం కాకినాడ జిజిహెచ్లో ల్యాబ్కు పంపుతున్నారు. అక్కడ పాజిటివ్ వచ్చిన తర్వాతే డెంగీగా నిర్ధారిస్తున్నారు. ఆయా ప్రభుత్వ ల్యాబ్ల నుంచి డెంగీ పాజిటివ్ కేసుల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు పంపుతుండగా వాటి ఆధారంగా జిల్లాలో నమోదవుతున్న డెంగీ కేసులను లెక్కకడుతున్నారు.

సీతా రాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్యకర్తలు

ఏచూరికి సిఐటియు ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ, ఏలేశ్వరం

సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి సిఐటియు ఘనంగా నివాళులర్పించింది. బుధవారం జిల్లా పరిషత్ సెంటర్లో సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకట రమణ అధ్యకతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షు రాలు జి.బేబిరాణి, జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థిగా ఎస్ఎఫ్ఐలో చేరి అభ్యు దయ మార్గంలో పయనించారని తెలిపారు. సిపిఎం లో వివిధ స్థాయిల్లో పనిచేసిన ఆయన 2015 నుంచి అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఉన్నారన్నారు. అనేక కార్మిక, రైతాంగ పోరాటాలకు మార్గదర్శిగా నిలిచారన్నారు. దేశంలో మతోన్మాద శక్తులను నిలువ రించి దేశ సమైక్యత, సమగ్రతల కోసం ఏచూరి తపన పడ్డారన్నారు. ఏచూరి పిలుపుతో ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ మతసామరస్యం పాటించాలని, లౌకిక వాదాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్కుమార్, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయ కులు వి. సత్యనారాయణ, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకట్రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎం.రమణమ్మ, జ్యోతి, నీరజ, భారతి, పద్మావతి, వర్మ, చరణ్, సిహెచ్.విజయ్కుమార్, ఏడుకొండలు, కుమార స్వామి, నురుకుర్తి ప్రకాశరావు, కె. సత్తిబాబు, గుండుబోగుల శ్రీనివాస్, సంతోష్, ఎంజి.సూరిబాబు, ఎ. సంజయ్, జివివి సత్యనారా యణ పాల్గొన్నారు. అలాగే ఏలేశ్వరంలో సిఐటియు అనుబంధ క్వారీ లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఏచూరి సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయ కులు పిల్లా రాంబాబు, రౌతు సత్యనారాయణ, గాంధారపు ఉప్మాకర్రావు, బూడి జగదీష్, ముప్పిడి శామ్యూల్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికలను రూరల్ మండలంలోని 8 విలీనం గ్రామాలతో కలిపి ఎన్నికలను నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాకినాడ కౌన్సిల్ పాలక వర్గం గడువు 2002 సెప్టెంబర్తో ముగిసిందని, దీంతో ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల కమిషన్ సర్క్యులర్ జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం అదే రీతిలో మున్సిపల్ డైరెక్టరేట్ను సర్క్యులర్ కోరింద న్నారు. 48 డివిజన్లతో ఎన్నిక లు నిర్వహించడం పూర్తి విరుద్ధం కారణంగానే రెండేళ్ల నుంచి ఎన్ని కల నిర్వహణ జరగ లేదన్నారు. కావున విలీన గ్రామాలతో కలిపి 50 డివిజన్లగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. లేకుండా కలెక్టరేట్ వద్ద నిరహార దీక్షను చేపడతామని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయి స్తామని చెప్పారు. విలీనం చేయాలనే డిమాండ్తో జరుగుతున్న కార్యచరణ కొనసాగుతాదన్నారు.

జాతీయ స్థాయికి శ్రీప్రకాష్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కోటనందూరు

ఈ నెల 14 నుంచి 17 వరకూ గద్వాల్లో సిబిఎస్ఇ బోర్డు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భం గా విద్యా సంస్థల అధినేత సిహెచ్.వికె.నరసంహరావు, సంయుక్త కార్యదర్శి విజయ్ప్రకాష్ మాట్లాడుతూ క్లస్టర్ -7 ఆంధ్రా, తెలంగాణా కబడ్డీ పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అండర్ - 14 విభాగంలో పి.శివాజీ బృందం, అండర్ - 19 విభాగంలో ఎం.గణేష్ బృందాలు బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అక్టోబర్ 17 నుంచి 20వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, కోచ్, విద్యార్థుల తల్లీదండ్రులు పాల్గొన్నారు.

విజేతలతో శ్రీప్రకాష్ విద్యా సంస్థల ప్రతినిధులు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాల్లో గృహాలు నష్టపోయిన బాధిత మహిళలకు వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి పంపించిన ఆర్థిక సాయాన్ని మాజీ ఎంపి వంగ గీత బాధితులకు అందించారు. బుధవారం పిఠాపురం వైసిపి కార్యా లయంలో పిఠాపురం మండలం సీతారా మపురం, యు.కొత్తపల్లి మండలం కొండవరం శివారు కాశివారిపాకలకు చెందిన మైలవరపు లోవలక్ష్మి, వాసంశెట్టి శ్రీలక్ష్మి గృహాలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. అయితే ఏలేరు ముంపు ప్రాంతాల్లో పర్యటించేందుకు వచ్చిన జగన్మోహన్ రెడ్డి వద్ద బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు తెలియచేసిన ఏమాత్రం స్పందించలేదని చెప్పారు. దీంతో ఆయన వైసిపి లీగల్ టీంను క్షేత్ర స్థాయి పరిశీలించి తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే బాధితుల్లో లోవ లక్ష్మికి రూ.1 లక్ష, వాసంశెట్టి శ్రీలక్ష్మికి రూ.50 వేలు మంజూరు చేశారు. ఆ సాయాన్ని వంగా గీత బాధితులకు అందజేశారు.

బాధితులకు చెక్కును అందిస్తున్న మాజీ ఎంపీ వంగా గీత

ఆదిత్య విద్యార్థుల రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదిత్య విద్యార్థులచే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో 180 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ఎంతో అభినం దనీయమని అన్నారు. విద్యార్థులందరూ రక్త దానం చేసి మరో ముగ్గురికి ప్రాణదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ ఎం.రఘునాథ్, చిట్టూరి రాంప్రసాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ పి.దుర్గారాజు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఆదిత్య విద్యార్థి, నిర్వాహకులు

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మన పెద్దాపురం గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృత్వం కార్య క్రమంలో లూథరన్ హైస్కూల్ 2006-07 10వ తరగతి బ్యాచ్ ఆర్థిక సాయంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక, కండవిల్లి సత్యనారాయణ, తమనార లక్ష్మణ్ దివాకర్, హైదర్ ఆలీ, రామకృష్ణుడు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఎస్ఐ మౌనిక

బచ్చు హైస్కూల్లో సేవా పక్షోత్సవాలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక 'బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్'లో బుధవారం పిఎం మోడీ పుట్టిన రోజు సందర్భంగా 'సేవా పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ కార్యక్రమ ఇన్ఛార్జ్ డాక్టర్ గోరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణను శు భ్రం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటంరెడ్డి ఏడుకొండలు, తలాటం గంగ బాబు, ఆల్లు ప్రసాద్, పోతుల వీర ప్రభాకర్రావు, హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రతిఒక్కరూ పర్యా వరణ పరిరక్షణ కోసం కృషి చేయా లని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం గోకవరం రోడ్డులో ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళా శాల వద్ద స్వచ్ఛతాహీ సేవ పక్షోత్స వాలను నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంఉపాధి పథకంలో తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, జడ్పి సిఇఒ పాఠంశెట్టి నారాయణమూర్తి, డిపిఒ సౌజన్య భారతి, నాయకులు ఎస్వివిఎస్. అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, బిందు మాధవి, రఘురాం, తహశీల్దార్, ఎంపిడిఒ, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను నాటుతున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

బాధ్యతతో వైద్యాన్ని అందించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఫార్మసీ రంగంలో ఉన్న విద్యార్థులు సమాజానికి బాధ్యతతో వైద్య సేవలను అందించాలని కాకినాడ రూరల్ డ్రగ్ ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పటవల పైడా గ్రూపు విద్యాసంస్థల్లో ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 4వ జాతీయ స్థాయి ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మందుల షాపుల్లో చాలా రకాల డూప్లికేట్ మందులు విరివిగా లభ్యమవు తున్నాయని, భవిష్యత్తులో ఇలాంటి వాటిని అరికట్టేలా విద్యార్థులు ఆలోచన చేయాలని సూచించారు. విద్యాసంస్థల సెక్రటరీ శ్రీరామ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ విద్యా సంస్థల్లో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ నిత్యా శ్రీరామ్, డీన్ వీరభద్రరావు, డిడి రవీంద్రారెడ్డి, అధ్యాపకులు వెంకట్ పాల్గొన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న డ్రగ్ ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ

పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజారోగ్య పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై బుధవారం స్థానిక పద్మనాభ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ దావీదురాజు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజారోగ్యం బాగుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. మురారి హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి బాలుర సెలక్షన్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. మండలంలోని గండేపల్లి, మల్లేపల్లి, మురారి, తాళ్లూరు, నాయకంపల్లి, సూరంపాలెం హైస్కూల్స్ నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్-14 వాలీబాల్, అండర్-17 వాలీబాల్, అండర్-14 ఖోఖో, అండర్-17 ఖోఖో, అండర్-14 కబాడీ, అండర్-17 కబాడీ, అండర్-14 చెస్, అండర్-17 చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఉత్తమ ప్రతిభ ఆధరంగా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పిఎంసి మెంబర్ ఎస్ శ్రీనివాసు, పాఠశాల హెచ్ఎం ఎన్ అమ్మాజీ, సర్పంచ్ కుక్కల ఆనంద్బాబు, మండల ఎస్జిఎఫ్ఐ కోఆర్డినేటర్ ఎస్.నవీన్ కుమార్, పీడీలు, పిఇటిలు జి.హరికృష్ణ, వరప్రసాద్, గురుమూర్తి, ప్రసన్న కుమారి పాల్గొన్నారు. అలాగే మండల స్థాయి బాలుర సెలక్షన్స్లో గండేపల్లి హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనపరిచి పలు క్రీడల్లో 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ ప్రసన్నకుమారి తెలిపారు. అండర్-17 కబడ్డీ లో ఒకరు, అండర్-14 కబడ్డీలో ఒకరు, అండర్-14 ఖోఖోలో ఐదుగురు, అండర్-17 ఖోఖోలో ఇద్దరు, అండర్-14 వాలీబాల్లో నలుగురు, అండర్-17 వాలీబాల్లో ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం వి.వెంకటేశ్వరరావు, ఎస్ఎంసి ఛైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.



టాస్ను వేయిస్తున్న ఉపసర్పంచ్ జాస్తి వసంత్

ఉచిత మెగా వైద్య శిబిరం

వైద్య సేవలందిస్తున్న సూర్య గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సెయింట్ జాన్స్ లూథరన్ చర్చ్లో బుధవారం చర్చి పాస్టర్ డాక్టర్ వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సూర్య గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలన్నారు. సూర్య గ్లోబల్ హాస్పిటల్లో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి ట్రెజరర్ స్టాలిన్ ధర్మదాస్, ఎల్సిసి, పిసిసి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని బోయినపూడి గ్రామంలో పౌష్టికాహారమాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, తల్లులకు, బాలింతలకు, పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గర్భి ణులకు సీమంతాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి చల్లా శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త సూర్యకుమారి పాల్గొన్నారు.

23న ఎంఆర్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మహారాణి కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్పిబికె.సత్యనారాయణరావు జన్మదినం సందర్భంగా ఈనెల 23న మహారాణి కళాశాల వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో బయోఫెస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తారన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు సైన్సు ఎగ్జిబిషన్పై అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తారన్నారు. ముగింపు సభలో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులందరికీ బహుమతులు అందజేస్తారన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి - కోటనందూరు

భీమవరపుకోట గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానిక విఆర్ఓ ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ సిఐ చెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే యువకుడు మృతి చెందినట్లుగా పోలీసులు గుర్తించారు. స్థానిక విఆర్ఓ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో, క్లూ టీం తోను పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మృతుని ఆచూకీ తెలిస్తే సంప్రదించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మృతుని ఆచూకీ తెలిసిస్తే ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ డి.జ్వాలా సాగర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. పళ్ళవారిపాలెం వివేకానంద వారధి వద్ద గౌతమీ గోదావరి నది పాయలో మంగళవారం లభ్యమైన మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిమిత్తం ఉంచినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహం నుంచి లభ్యమైన ఆధారాల ప్రకారం విజయవాడ రూరల్ మధురానగర్‌కు చెందిన ముద్దన సూర్యనారాయణ(53)గా భావిస్తున్నప్పటికీ, బంధువులకు సమాచారం అందించినా ఇప్పటి వరకు ఎవరు రాలేదన్నారు. గుర్తుతెలియని మృతదేహంగా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహం ఆచూకీ తెలిసినవారు ముమ్మిడివరం ఎస్ఐ సెల్ నెంబర్. 9440796564ను సంప్రదించాలన్నారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలకు సంబంధించి వచ్చిన ముందస్తు సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. రావులపాలెం మండలంలోని రావులపాడు గ్రామంలో అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 36 బ్యాగుల్లో. సుమారు 2,123 కేజీల పిడిఎస్ బియ్యంతోపాటు, ఒక్క తూకం యంత్రం, మూడు మోటార్ సైకిళ్ళు, ఒక్క వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ రూ.82,750 ఉంటుందన్నారు. సంబంధిత వ్యక్తులపై 6-ఏ క్రింద కేసు నమోదు చేసినట్లు రీజనల్ విజిలెన్స్ ఎస్‌పి కెఎస్-ఎస్‌వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, విజయ్ కుమార్, వీరబాబు, లోవరాజు సిఎస్‌డిటి అలిషా పాల్గొన్నారు.

అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కరప

నూతన కార్యవర్గంతో అతిథులు

మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ హెల్పర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. బుధవారం స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలోని జరిగిన ఈ సమావేశంలో తొలుతగా కెమెరా సృష్టికర్త లాయిస్ డాగ్రే చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా మల్లిపూడి వీర వెంకట సత్యనారాయణమూర్తి, కార్యదర్శిగా బావిశెట్టి దుర్గాంజనేయ చక్రమహారుద్ర సత్యనారాయణ, కోశాధికారిగా నక్కా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా తెమ్మనబోయిన వీరభద్రరావు, ఉపాధ్యక్షులుగా చుక్క శ్రీనివాసరావు, ఉప కార్యదర్శిగా కామిరెడ్డి ఎంకన్నబాబు, గౌరవ సలహాదారునిగా పోలిశెట్టి శ్రీనుబాబు ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తోట సూర్య సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖమ్మరు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

తాళ్లరేవు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

విజేతలతో ఉపాధ్యాయులు, నాయకులు

టెకీ బోట్ సంస్థ సూరంపాలెంలో నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్ పోటీల్లో తాళ్ళరేవు హైస్కూల్ ఎటిసి ల్యాబ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్ఎం ఆశాలత తెలిపారు. ఈనెల 22న ఆంధ్ర యూనివర్సిటీలో జరిగే టెక్ లీగ్-2024 పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు దుర్గాసత్యప్రసాద్, సాయి వీర వెంకటలక్ష్మిసత్య చరన్, మోహన్ కీర్తి, మోకా శ్రీ ఆదర్శ గీతాంజలి, రేవంత్ అశ్విన్ ప్రశాంత్, బండారు వీరబాబులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ శివన్నారాయణ, ఉపాధ్యాయులు వాకపల్లి అప్పారావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - రౌతులపూడి

సత్కారాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రౌతులపూడి జడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోళ్ల రాంబాబు, ఎన్.సింహాచలం, వై.రాజులును ఘనంగా సత్కరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, జడ్‌పిటిసి గోల్లు లక్ష్మణమూర్తి. యుటిఎఫ్ బృందం, జై భీమ్ యూత్ అవార్డు గ్రహీతలను అభినందించారు. విద్యాభివృద్ధిలో రౌతులపూడి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న గ్రంధి నారాయణరావు

ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని ఆనంద భారతి ప్రాంగణంలో బెంగుళూరు ప్యాలెస్ ముఖద్వారంతో శ్రీ దుర్గ ట్రేడ్ ఫెయిర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రముఖ ఎగ్జిబిషన్ ప్రముఖ వ్యాపారవేత్త, టిడిపి నాయకుడు గ్రంధి నారాయణరావు బుధవారం ప్రారంభించారు. కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ ప్రదర్శన తిలకించి ఆనందం పొందాలని బాబ్జి ఆకాంక్షించారు. ఈ ప్రదర్శనలో పిల్లలతో పాటు పెద్దలకు ఆహ్లాద పరిచే ఎన్నో రకాల పరికరాలను, వస్తువులను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మల్లిపూడి వీరు, తోట సుధీర్, గట్టి సత్యనారాయణ, గుత్తుల రమణ, అమన్ జైన్, బొబ్బిలి గోవిందు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తూర్పుపాకలులో జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ పడాల అన్నపూర్ణ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి ఇన్‌ఛార్జ్ పి.వీరరాఘవులు, నాయకులు పేరెపురెడ్డి చంద్రశేఖర్, కాంట్రాక్టర్ సాయి పాల్గొన్నారు.

వేలంలో రికార్డు స్థాయిలో లడ్డూల ధర

ప్రజాశక్తి - ఏలేశ్వరం, తాళ్లరేవు

ఏలేశ్వరంకు చెందిన దిబ్బలపాలెం సాయినగర్ మండపంలో వినాయక లడ్డూలు రికార్డు స్థాయిలో వేలం జరిగింది. మండపంలో ఉంచిన 18 లడ్డూలకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో పైల శైలజ అనే మహిళ 1,08,703లకు పాడి లడ్డూలను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆకాశపు బుల్లియ్య, చల్లా రాము, గోపాలపురం సాయి, నూకపయ్య, సతీష్ పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండల పరిధిలోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో లక్ష్మీ గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక లడ్డూను టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి బాబి రూ.1.25 లక్షలకు దక్కించుకున్నారు. వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా లడ్డూను వేలం వేయగా స్థానిక తాళ్ల వ్యాపారి పెద్దిరెడ్డి బాబి రూ. 1.25 లక్షలకు పాడుకున్నారు.

నేడు, రేపు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 19, 20 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఇఒలు ఇ.ప్రభాకర్ వర్మ, విఆర్‌కె.చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మహారాణి కళాశాల ఆవరణలో నిర్వహించే ఈ పోటీలు 19వ తేదీన బాలురుకు, 20న బాలికలకు నిర్వహించబడతాయన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కబడ్డీ, కో కో, వాలీబాల్, షటిల్, బ్యాట్మెంటన్, యోగ, చెస్, అథ్లెటిక్స్ అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహిస్తారన్నారు. ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

యానాం వార్తలు

నిరసన వ్యక్తం చేస్తున్న ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు

యానాంలో బంద్ ప్రశాంతం

ప్రజాశక్తి - యానాం

పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా ఇండియా కూటమి పిలుపు మేరకు బుధవారం యానాంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. బుధవారం ఉదయం 6 గంటల సాయంత్రం 6:00 వరకు బంద్ నిర్వహించారు.కాంగ్రెస్, సిపిఎం, విసికె పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం, విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. బంద్ కారణంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇండియా కూటమి నాయకులు మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ రెగ్యులరిటీ అథారిటీ ప్రజాభిప్రాయాలు లేకుండా సొంత నిర్ణయాలతో యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ వ్యాప్తంగా ప్రజలపై అదనపు విద్యుత్ ఛార్జీలు వేయడం దారుణమన్నారు. వాడుకున్న విద్యుత్ బిల్లు కంటే అదనపు ఛార్జీతో డబల్ బిల్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని పరిశ్రమలు బిల్లులు కట్టకుండా ఎగ్గొట్టాయని, దానిని పేద ప్రజలపై భారం వేసి అధిక బిల్లులు వసూలు చేస్తున్నారని అన్నారు.కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు వరాలు,పేదలపై భారాలు వేయడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, డిజిటల్ మీటర్లు మార్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధాని దినేష్, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, యానాం సిపిఎంకార్యదర్శి జి దుర్గాప్రసాద్, విసికె పార్టీ అధ్యక్షులు మెల్లం శ్రీనివాసరావు, మోకా బుజ్జి, సిపిఎం కార్యకర్తలు కుంచే శ్రీనివాసరావు, ఇళ్ల వాసు, సబ్బతి రాంబాబు, దాసరి రాజు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్ద బందోబస్తు

బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

విద్యుత్ ఛార్జీలు పెంపుపై బంద్ జరుగుతుంటే మద్యం షాపులు మాత్రం తెరవడంపై ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం దుకాణాన్ని బంద్ చేయించకుండా పోలీసులు బందోబస్తుగా ఉండటాన్ని ఆందోళనకారులు తప్పుపట్టారు.

పలుచోట్ల అన్నదానాలు

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో బుధవారం పలు ప్రాంతాల్లో చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మెట్టకూరు గణపతి నగర్, జిఎన్ నాయుడు కాలనీల్లో నిర్వహించిన అన్నదానాల్లో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన

కరాటేలో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలో వాగ్దేవి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఏలూరులో సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వేదికగా జరిగిన నేషనల్ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభను కనబర్చి గోల్డ్ మరియు సిల్వర్ మెడల్స్ సాధించారు. 4వ తరగతి చదువుతున్న జి. విశ్వక్ కష్ణసాయి గోల్డ్ మెడల్ సాధించగా, 4వ తరగతి చదువుతున్న టి. మనస్విని, పి. ధన్యశ్రీ లు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థుల్ని బుధవారం స్కూల్ డైరక్టర్ పరసా భరత్, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీష్టి శ్రీరామచంద్ర మూర్తి, హెచ్ఎం. పిచ్చిక సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

కుర్చీలు అందజేస్తున్న బాలకృష్ణ

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల అందజేత

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

గొల్లవిల్లి పంచాతీ వాడపర్రు అంగన్ వాడీ కేంద్రంలో బుధవారం గ్రామానికి చెందిన జనసేన సీనియర్ నాయకులు మంచెం బాలకష్ణ పుట్టినరోజు సందర్భంగా కుర్చీలు పంపిణీ చేశారు. పుట్టినరోజు కేక్ ను బాలకష్ణ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బాలకష్ణకు నాయకులు అభిమానులు పుష్పగుచ్చాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు సలాది నాగరాజు, మంచెం బుజ్జి, మద్దింశెట్టి ప్రసాద్, పి ఎం సి చైర్మన్ వాలా సత్తిబాబు, మారిశెట్టి నాని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సిపిఐ శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రెవల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు పార్టీ కార్యాలయంలో రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు అక్టోబర్ 15, 16, 17వ తేదీల్లో నిర్వహిస్తారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి ముత్తబత్తుల నాగమణి అధ్యక్షతన బుధవారం అమలాపురంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ మాట్లాడుతూ నిత్యం ముంపునకు గురవుతున్న లంక గ్రామాలకు రాకపోకలు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం శాశ్వత పరిష్కారంగా బ్రిడ్జిలు నిర్మించాలన్నారు. ఆర్‌సిపిఐ రాష్ట్ర పార్టీ శిక్షణ తరగతులకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె.వి.రెడ్డి, పద్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌలుదారులకు రుణార్హత కార్డులు

ప్రజాశక్తి -అమలాపురం

కోనసీమ జిల్లాలో రుణ అర్హత కలిగిన కౌలుదారులందరికి రుణ అర్హత కార్డులు జీవో నెంబర్ 596 ప్రకారం నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పారదర్శకంగా జారీ చేయాలని వ్యవసాయ ఉద్యాన రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన సహకార శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కౌలుదారుల రుణ అర్హత కార్డుల జారీ ,రుణాల కల్పన, వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి ఈ పంట నమోదు, రైతు వారి ఈకెవైసి నమోదు సామాజిక తనిఖీ నిర్వహణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల రికార్డుల కంప్యూటరైజేషన్, వాణిజ్య బ్యాంకులు ఫ్యాక్స్ ద్వారా కౌలుదార రైతాంగానికి రుణాల కల్పన, ఆన్లైన్ ఉచిత ఇసుక విధానం, ఈ-పంట లో ఈ -ఫిష్ నమోదు కాకుండా జాగ్రత్తలు, అక్రమంగా ఇసుక , ఆక్వా చెరువుల ఏర్పాటు శాయిల్ ఎర్త్ నియంత్రణ చర్యలు పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించి జారీ చేసిన కౌలుదార రుణ కార్డులను చెక్ లిస్ట్ జిఒ నిబంధనల మేరకు సవరించి ఈ నెల 25వ తేదీ నాటికి నివేదిక సమర్పించాలన్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ వారి సూచనలకు అనుగుణంగా మాత్రమే ఆక్వా చెరువులకు అనుమతి ఇవ్వాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కనీసం ఐదు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తూ రికార్డుల భద్రతపై అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. రికార్డులు కలిగి శిథిలావస్థకు చేరిన భవనాలకు ఇతర నిర్వహణ ఖర్చుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తారన్నారు. మండల కేంద్రాలలో వర్షపాతం రీడింగ్ నమోదయ్యే పరికరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న 166 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల డేటా కంప్యూటరీకరణ నూటికి నూరు శాతం పూర్తి చేసి అక్టోబర్ రెండు నాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు. విలేజ్ వ్యవసాయ అధికారి వీఆర్వోలు అదేంట్లికేషన్ తో అగ్రికల్చర్ ఏవోలు ఈ పంట నమోదు ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి సోషల్ ఆడిట్ కూడా పూర్తి చేయాలని మిగిలి ఉన్న రైతుల వివరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా స్వీకరించి పూర్తి స్థాయిలో ఈ పంట రైతు వారి ఈకెవైసి ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. కౌలుదారు రుణ అర్హత కార్డులు అర్హులందరికీ మంజూరు చేస్తూ పంట రుణాలు కూడా ఇప్పించాలని ఆదేశించారు. ఈ -పంట లో ఈ- ఫిష్ చెరువుల విస్తీర్ణం నమోదు కాకుండా మెలకువలు పాటిం చాలన్నారు. ఈనెల 19వ తేదీ నుండి ప్రారంభించనున్న ఆన్‌లైన్‌లో ఉచిత ఇసుక పాలసీ విధానంపై సాంకేతిక నిపుణులు అధికారులకు అవగాహన పెంపొందించారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి ఇసుక తవ్వకాలు ఇసుక విక్రయాలు నిర్వహించడం లేదని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 15 నుండి పూర్తి స్థాయిలో రీచ్ లలో యార్డు లలో ఇసుక లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇకపై ఆన్‌లైన్‌లో ఎపి ఈ సేవ పోర్టల్ నందు జిల్లా గనులు భూగర్భ శాఖ పోర్టల్ లో ఇసుకను బుక్ చేయవచ్చునని లేదా గ్రామ సచివాలయాల్లో కూడా నమోదు చేసుకుని అవకాశం ఉందని రవాణాకు కూడా ఆన్‌లైన్‌లో చర్యలు తీసుకుంటారన్నారు. అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి డ్రోన్ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ వ్యవస్థలు అందుబాటులోనికి తీసుకువస్తామన్నారు. ఈ సందర్భంగా పొలం పిలుస్తోంది పోస్టర్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి మురళీ కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, ఉద్యాన అధికారి బివి. రమణ, ఆర్‌డిఒలు ఎస్.సుధాసాగర్, జెవివి. సత్యనారాయణ, జి.కేశవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

కోటిపల్లి రైల్వేలైన్ అలైన్మెంట్ వివరాలు సమర్పించాలి

అమలాపురం: కోటిపల్లి - నరసాపు రం రైల్వేలైన్ అలైన్మెంట్ ప్రకారం క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాలు మండలాలు వారీగా డివిజన్ స్థాయిలో మ్యాపులతో సహా ఏయే శాఖలకు సంబంధించి ప్రస్తుతం అలైన్మెంట్ లో ఉన్న గ్యాస్ పైప్ లైన్లు, వివిధ రహదారులు, ఇళ్లు, భవనాలు వంటి మౌలిక వసతులు తొలగించాల్సి వస్తుందో వాటి పూర్తి వివరాలను సమర్పించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో అమలాపురం డివిజన్లోని తహశీల్దార్లు, ఆర్‌డిఒలతో సమావేశం నిర్వహించారు. రైల్వే లైన్ ఏలైన్మెంట్ ప్రాథమికంగా నిర్వహించిన తొలి సర్వే నివేదికలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వే లైన్ ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న వాటి వివరాలను సర్వే నంబర్లు వారీగా వాటిలో ఉన్న భవనాలు కాలువలు, గ్యాస్ ఆర్డబ్ల్యూఎస్ పైప్‌లైన్లు, రహదారులు, తదితర వివరాలతో సమగ్రమైన నివేదికను రూపొందించాలన్నారు.

చిన్న బొడ్డువెంకటాయపాలెం లో విద్యుత్ కాంతులు

ఘనంగా మహాలక్ష్మి జాతర

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మహాలక్ష్మి జాతర, తీర్థ మహోత్సవాల్లో భాగంగా కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం, పెద్ద వెంకటయ్యపాలెం జంట గ్రామాలు విద్యుత్ కాంతులతో మెరిశాయి. ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ తీర్థ మహోత్సవాలతో జంట గ్రామాలు విద్యుత్ దీపాల అలంకరణలో పోటీ పడుతూ ఉంటాయి. రెండు గ్రామాలు లక్షలాది రూపాయలు విద్యుత్తు కాంతు లకే వెచ్చిస్తాయి. అలంకరణ చూడ్డానికి పరిసర గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వెండి కిరీటం, మకర తోరణం అందజేత

ప్రజాశక్తి-ఆలమూరు

ఖండ్రిగపేటలో శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలంకరణార్ధం బుధవారం స్థానిక వ్యాపారవేత్తలు శ్రీవినాయక బ్రిక్స్ అండ్ శ్రీతేజస్విని ఆయిల్స్ పెట్రోల్ బంక్ అధినేతలు రావాడ సత్తిబాబు దంపతులు, ఆయన కుమారుడు రావాడ నరేష్ దంపతులు కలసి రూ. 1,03,116 వెచ్చించి వెండి కిరీటం, ఇత్తడి మకర తోరణం అందజేశారు. దీంతోకాళ్లకూరి సూరి పండు బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు ద్విబాష్యం సూర్య ప్రకాష్ నేతత్వంలో సంప్రోక్షణ కార్యక్రమాలు జరిపించారు. అనంతరం స్థానిక భక్తులకు అన్నదానం చేశారు. .

బాల గణపతి లడ్డు వేలం

మామిడికుదురు: నగరం మల్లాయిపాలెం లో శ్రీ బాల గణపతి నూతన మండపం వద్ద వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా స్వామి వారి మండపం వద్ద ఏర్పాటు చేసిన 5 కేజీల లడ్డు ప్రసాదాన్ని వేలం వేశారు. కుక్కల మహాన్ (మున్నా) రూ.30,116కు లడ్డు కైవసం చేసుకున్నారు. బుధవారం నగరం పంచాయతీ సమీపంలో రామాలయం వద్ద, మొల్లేటి వారి మెరక రామాలయం వద్ద భారీ దానం నిర్వహించారు.

వైసిపి నేత చెల్లుబోయిన పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర వైసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చెల్లుబోయిన శ్రీనివాసరావు 52వ పుట్టినరోజు వేడుకలు అమలాపురంలో బుధవారం వారి స్వగహం నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు రోగులకు రొట్టెలు, పండ్లు, హరిమనోవికాస కేంద్రం లో పిల్లలకు పండ్లు, ఇమ్మిడివరప్పాడు ఒల్డ్ ఏజ్ హోం నందు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.బ్లైండ్ స్కూల్ నందు బోజనాలు ఏర్పాటు చేశార. కార్యక్రమంలో ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్, అల్లవరం జెడ్‌పిటిసి సభ్యుడు కొనుకు గౌతమి అల్లవరం మండల సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు


విరాళం అందజేస్తున్న సిఎంఆర్ సంస్థల అధినేత

విద్యానిధికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం విద్యానిధి వార్షిక చందా రెండు సంవత్సరాలకు గాను రూ.లక్ష చెక్కును సిఎమ్ఆర్ సంస్థల అధినేత మావూరి వెంకట రమణ, సంఘ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి బుధవారం విశాఖపట్నం లో అందజేశారు..ఈ సందర్భంగా రూ.లక్ష విరాళాన్నిచ్చిన మావూరి వెంకట రమణ కు సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు జాన బాబ్జీ, ఉపాధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, ప్రధాన కార్యదర్శి పుత్సల వరదరాజు, బళ్ల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KATRAGADDA HEMANTH CHOWDARY,** S/o. Katragadda Rajendra Prasad, D.No. 2-8-1, Panchayathi Street, Katavaram (Village), Seethanagaram Mandal, E.G.District, A.P., I have changed my name from **CHALLAMALLA HEMANTH CHOWDARY,** S/o. Challamalla Vijaya Bhaskara Rao (Old Name) to **KATRAGADDA HEMANTH CHOWDARY,** S/o. Katragadda Rajendra Prasad (New Name). Hence forth Iam being called **KATRAGADDA HEMANTH CHOWDARY,** S/o. Katragadda Rajendra Prasad and Katragadda Vijaya Bharathi for all purpose.

సర్టిఫికెట్ పడిపోయినది

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, గుండెపూడి గ్రామానికి చెందిన కర్రి పార్వతి, D/o. ధర్మారావుకు చెందిన పదవ తరగతి మార్కు లిస్ట్ పడిపోయినది. నా ఒరిజినల్ మార్కు లిస్ట్‌ను తీసుకొని ఇంటి వద్ద నుండి దేవగుప్తం సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్‌పై వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

కర్రి పార్వతి
D/o. ధర్మారావు, డో.నెం.1-181
పల్లిపాలెం, గుండెపూడి, అల్లవరం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

పాస్‌పోర్టు పోయినది

నిమ్మకాయల దుర్గ రమేష్, S/o. అప్పారావు, డో.నెం. 71-9-32/2, తారకరామా నగర్, లాలాచెరువు, తూర్పుగోదావరి జిల్లాలో నివసిస్తున్న నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు **ది. 12-6-2023న X6001819** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసిన పాస్‌పోర్టు నేను **ది. 30-8-2024వ తేదీన** నేను కవరులో పెట్టుకొని మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా బిక్కవోలు మార్గం మధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది ఫోన్ నెంబరుకి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

నిమ్మకాయల దుర్గ రమేష్
సెల్: 80746 28062

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

దూనబోయిన నాగ వెంకట సత్య శివ కృష్ణ తండ్రి శ్రీనివాసరావు డోర్ నెంబర్ 21/38 రామాలయం ఎదురుగా పెద్దగుళ్ళపాలెం కొత్తపేట మండలం తూర్పుగోదావరి జిల్లా అను నా పేరునున్న పాస్‌పోర్టు **నెం.U 3390559** గల పాస్‌పోర్టు ను మా ఇంటి నుండి కొత్తపేట జిరాక్స్ కోసం తీసుకు వెళ్తుండగా దారి మధ్యలో లో పడిపోయినది దొరికిన వారు ఈ కింది అడ్రస్ అందజేయగలరు.

దూనబోయిన నాగ వెంకట సత్య శివ కృష్ణ
తండ్రి శ్రీనివాసరావు
డోర్ నెంబర్ 21/38,రామాలయం ఎదురుగా
పెద్దగుళ్ళ పాలెం కొత్తపేట మండలం
తూర్పుగోదావరి జిల్లా, సెల్ 8500151688

మహారాజశ్రీ 4వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారికోర్టు, రాజమహేంద్రవరం
I.A.No453/2023 in O.S.No.623/2023

Between:
Ambati Veera Venkanna ...**Petitioner/Plaintiff**
And
Ambati Veera Laxmi, W/o.Late Paddaraju, Hindu, Housewife, age 40years, D.No.2-54, Madhurapudi Village, Korukonda Mandal, East Godavari District.,
Present address, C/o.Budda Nagaraju, S/o.Arjanna, R/o.Venkatakrishnarayapuram, Samalkota Mandal.
...**Respondent/Deffndent**

పై నంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు / ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **23-09-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటిషన్ మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వై.దొరబాబు
పి.ధనలక్ష్మి
రాజమండ్రి అడ్వకేట్స్
14-09-2024 రాజమండ్రి

మహారాజశ్రీ అమలాపురం రెండవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S. 27/2024

Between:
Yellamilli Satya ...*Appellant*
AND
Yellamilli Venu Mohan & Others ...*Respondents*

To:
R-2: Yellamilli Venkata Lakshmi, W/o. Gopala Krishna, Hindu, age 56 years, Agraharam, Hamlet of Mummidivaram, Mummidivaram Mandal, Dr. B.R.A. Konaseema Dist.,

పై నెంబరు అప్పీలులో మీరు రెండవ రెస్పాండెంట్ అయివున్నారు. సదరు అప్పీలులో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు అమలు నిమిత్తం ప్రయత్నం చేయగా మీరు సదరు నోటీసులు తీసుకొనకుండా అప్పీలు కాలయాపన చేయు దురుద్దేశ్యముతో వుండియున్నందున కోర్టు వారి అనుమతితో ఈ పేపరు ప్రకటన ఇవ్వడం అయినది. ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా సదరు పై నెంబరు అపీలు మీ హాజరు నిమిత్తం ది. 30-9-2024వ సంవత్సరం తేదీకి వాయిదా అయివున్నది.

సదరు 30-9-2024వ సంవత్సరం తేదీన మీరు పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు అయి మీ అభ్యంతరములు తెలుపుకొనని యెడల సదరు అపీలు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడం అయినది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
N.V.SURYANARAYANA
అమలాపురం Advocate, Amalapuram
ది.17-9-2024 Cell: 94408 42076

మహారాజశ్రీ అమలాపురం రెండవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S. 23/2024

Between:
Kona Venkata Srinivasa Rao ...*Appellant*
AND
Yellamilli Venu Mohan & Others ...*Respondents*

To:
R-3: Yellamilli Venkata Lakshmi, W/o. Gopala Krishna, Hindu, age 56 years, Agraharam, Hamlet of Mummidivaram, Mummidivaram Mandal, Dr. B.R.A. Konaseema Dist.,

పై నెంబరు అప్పీలులో మీరు మూడవ రెస్పాండెంట్ అయివున్నారు. సదరు అప్పీలులో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు అమలు నిమిత్తం ప్రయత్నం చేయగా మీరు సదరు నోటీసులు తీసుకొనకుండా అప్పీలు కాలయాపన చేయు దురుద్దేశ్యముతో వుండియున్నందున కోర్టు వారి అనుమతితో ఈ పేపరు ప్రకటన ఇవ్వడం అయినది. ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా సదరు పై నెంబరు అపీలు మీ హాజరు నిమిత్తం ది. 30-9-2024వ సంవత్సరం తేదీకి వాయిదా అయివున్నది.

సదరు 30-9-2024వ సంవత్సరం తేదీన మీరు పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు అయి మీ అభ్యంతరములు తెలుపుకొనని యెడల సదరు అపీలు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడం అయినది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
కె.తాతంరాజు
గుత్తుల శ్రీనివాసరావు
అమలాపురం ముమ్మిడివరం, అడ్వకేట్
17-9-2024 సెల్:9440528135